పేదరిక నిర్మూలన-ప్రస్తుత ప్రోత్సాహక పథకాలు

1991నాటి సంస్కరణల తర్వాత భారత ఆర్థిక వ్యవస్థలో వృద్ధి వేగవంతమైంది. ఈ క్రమంలో ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపుదిద్దుకుంది. దేశంలోని ఆర్థిక వృద్ధి ఫలాల వల్ల అనేక మంది ప్రజలు లబ్ధి పొందారు. మధ్య ఆదాయ కుటుంబాలే కాక, తక్కువ ఆదాయ కుటుంబాలు కూడా ఈ అవకాశం చేజిక్కించుకున్నాయి. నేషనల్ శాంపుల్ సర్వే అంచనా ప్రకారం... దారిద్ర్య రేఖకు దిగువన నివసించే జనాభా సంస్కరణల తర్వాత కాలంలో తగ్గింది. 1993-94లో ఆ జనాభా 36 శాతం కాగా, 1999-2000 నాటికి 26 శాతానికి తగ్గింది. 2004-05లో Mixed Recall Period వినియోగ పంపిణీ దత్తాంశం ఆధారంగా 21.8 శాతం మంది.. Uniform Recall Period వినియోగ పంపిణీ దత్తాంశం ఆధారంగా 27.5 శాతం మంది దారిద్ర్య రేఖ దిగువన నివసిస్తున్నారని NSSO అభిప్రాయపడింది. ప్రభుత్వ చర్యల ఫలితంగా దేశంలో పేదరికం 2007 నాటికి 19.3 శాతానికి, 2012 నాటికి 9.3 శాతా నికి తగ్గే అవకాశముందని కిరిత్ పారిఖ్, ఆర్. రాధాకృష్ణ అభిప్రాయపడ్డారు.

అందరికీ అందని ఫలాలు

ఆర్థికవృద్ధి ఫలాలు సమాజంలో అందరికీ ఒకేవిధంగా లబ్ధి చేకూర్చ లేకపోయాయి. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో సాంకేతిక ప్రగతి చోటు చేసుకోవడంతో శ్రమసాంద్రత పరిజ్ఞానానికి ప్రాధాన్యత తగ్గింది. అధిక నాణ్యత గల వస్తుసేవలను అధిక పరిమాణంలో ఉత్పత్తి చేస్తున్నా.. అందుకోసం తక్కువ మంది శ్రామికులను వినియోగిస్తున్నారు. శ్రామికులకు ప్రత్యామ్నా యంగా యంత్రాలు, యంత్ర పరికరాల వినియోగం పెరిగింది. 1999-2000 నుంచి 2004-05 వరకు నమోదైన ఆర్థిక వృద్ధి నిరుద్యోగ సమస్యపై ఎలాంటి ప్రభావాన్నీ చూపలేకపోయింది. ఈ కాలంలో గ్రామీణ పురుషుల నిరుద్యోగిత రేటులో ఎలాంటి మార్పులేదు. పట్టణ పురుషుల నిరుద్యోగం ఒక శాతం మాత్రమే తగ్గింది. మరోవైపు గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళల్లో నిరుద్యోగిత రేటు 1 శాతం పెరిగింది. దేశ జనాభాలో ఇప్పటికీ 1/3వ వంతు నిరక్షరాస్యులున్నారు. 15 సంవత్సరాల వయసు వరకు విద్యను అభ్యసించని వారే ఎక్కువ. మరోవైపు విద్యావం తుల్లోనూ ఉపాధి పొందడానికి అవసరమైన నైపుణ్యం తక్కువ. మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పు రాలేదు. గ్రామీణ పారిశ్రామికీకరణ తక్కువగా ఉండటం,వ్యవసాయరంగ సంక్షోభం వల్ల గ్రామీణ శ్రామికులు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లి దినసరి కూలీలుగా మిగులుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పెరుగుతున్న పేదరిక తీవ్రత కారణంగా పట్టణీకరణ జరిగింది. దీనికి తోడు దేశంలో పేదరిక వ్యాప్తి ఒకే విధంగా లేదు. ఒరిస్సా, బీహార్, మధ్యప్రదేశ్‌లో పేదరికం ఎక్కువ. సంస్కరణల యుగంలోను అక్కడ పేదరిక తీవ్రత తగ్గలేదు. కొన్ని వర్గాల ప్రజలు సంస్కరణల్లో భాగం కాలేకపోయారు. వీరికి



ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో పాల్గొనే సామర్థ్యం కూడా లేదు. వీరిని కూడా అభివృద్ధి ప్రక్రియలో భాగస్వా ములను చేసి.. తద్వారా పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. దారిద్ర్య రేఖ దిగువన నివసిస్తున్న వారికి లేదా పేదల్లోనే అత్యంత పేదలకు ప్రభుత్వ సహాయం తప్పనిసరి.

పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు

ప్రణాళికా యుగంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదరిక నిర్మూ లనా కార్యక్రమాలను 3 రకాలుగా వర్గీకరించవచ్చు.. అవి..

1) స్వయం ఉపాధి పథకాలు

2) వేతన ఉపాధి పథకాలు

3) ఆహార భద్రత, సాంఘిక భద్రతా కార్యక్రమాలు.

కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరే లబ్ధిని ఎక్కువగా అందించాలంటే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీల రూపంలో తోడ్పాటునందించాలి. ఫలితంగా పథకాల ప్రయోజనాన్ని పెంపొందించవచ్చు. ఉదాహరణకు అధిక సబ్సిడీలతో కూడుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రజాపంపిణీ వ్యవస్థలో.. దారిద్ర్య రేఖ దిగువన నివసించే రేషన్ కార్డుదారులకు కిలో రూ. 2కు బియ్యం సరఫరా, రూ. 30కు కిలో కందిపప్పు, రూ. 45కు లీటరు పామో లిన్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. వంటగ్యాస్‌పై కేంద్రం పెంచిన రూ. 50 భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది.

నాలుగో ప్రణాళికా కాలంలో లక్షిత వర్గాల ప్రజల అభివృద్ధి కోసం చిన్ననైతుల అభివృద్ధి ఏజెన్సీ, ఉపాంత రైతుల, వ్యవసా య కార్మికుల అభివృద్ధి ఏజెన్సీ, దుర్భిక్ష పీడిత ప్రాంతాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదో ప్రణాళిక పేదరిక నిర్మూల నకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. ఆ సమయంలో కనీస అవస రాల కార్యక్రమం, పనికి ఆహార పథకం, 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం, అంత్యోదయ కార్యక్రమం, ఎడారిప్రాంత అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రారంభించారు. ఆరో ప్రణాళిక (1980-85) పేదరిక, నిరుద్యోగ నిర్మూలనకు ప్రాధాన్యమిచ్చింది. 1977-78లో ప్రారంభించిన సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమాన్ని (ఐ.ఆర్.డి.పి.) 1980లో దేశవ్యాప్తంగా విస్తరించారు. IRDP పథకం ద్వారా సబ్సిడీతో కూడుకున్న పరపతి, శిక్షణ, అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తారు. స్వయం ఉపాధి ద్వారా లబ్ధి దారులు అదనపు

ఆదాయం పొందుతారు. 1980లలో ఈ పథకాన్ని షెడ్యూల్డ్ కులాలు, తరగతులు, స్త్రీలు, గ్రామీణ చేతివృత్తుల వారికి విస్తరించారు. IRDP కార్యక్రమానికి ఉప కార్యక్రమాలను చేపట్టారు. అవి.. స్వయం ఉపాధి కోసం గ్రామీణ ప్రాంత యువకులకు శిక్షణ (TRYSEM), గ్రామీణ స్త్రీ-శిశు సంక్షేమ పథకం(డ్వాక్రా) ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలో బృందంగా ఏర్పడిన కొందరు మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే ఈ పథకం ఉద్దేశం. సంబంధిత బృందంలోని మహిళలు చేసిన పొదుపుమొత్తంతోపాటు, ప్రభుత్వ సహాయం (రివాల్వింగ్ ఫండ్), బ్యాంకుల రుణాల ద్వారా సమకూర్చుకొన్న మొత్తం ద్వారా ఉమ్మడిగా లేదా వ్యక్తిగతంగా పలు ఆర్థిక కార్యకలాపాలు చేపడతాయి. ఇటీవల కాలంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో ఈ స్వయం సహాయక బృందాల పనితీరు సంతృప్తికరంగా ఉంది. ఫలితంగా మహిళల్లో స్వయం ఉపాధి పెరిగి, పేదరికం తగ్గుముఖం పట్టింది. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన అన్ని రకాల స్వయం ఉపాధి పథకాలను విలీనం చేస్తూ 1999, ఏప్రిల్ 1న 'స్వర్ణజయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరో ప్రణాళికలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేదవారికి ఉపాధిహామీ పథకం (RLEGP) లాంటి వేతన ఉపాధి కార్యక్రమాలు ప్రారంభమ య్యాయి. ఏడో ప్రణాళికలో జవహర్ రోజ్‌గార్ యోజన (JRY),నెహ్రూ రోజ్‌గార్ యోజన(NRY) పథకాలు; ఎనిమిదో ప్రణాళికలో ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన ప్రారంభమ య్యాయి. ఇవే కాకుండా 1993, అక్టోబర్ 2న ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. తొమ్మిదో ప్రణాళికలో సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, అన్నపూర్ణ, ప్రధానమంత్రి గ్రామోదయ యోజన, జయప్రకాష్ రోజ్‌గార్ గ్యారంటీ యోజన వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పదో ప్రణాళికలో (2002-07)భారత్ నిర్మాణ్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రారంభించారు.

రెండు ప్రోత్సాహక పథకాలు

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల వృద్ధికి భారత్ నిర్మాణ్ (2005-06), వేతన ఉపాధి కార్యక్రమమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (2006 ఫిబ్రవరి) అమల్లో ఉన్నాయి. ఈ రెండు కార్యక్రమాల ముఖ్య ఉద్దేశం గ్రామీణజనాభా జీవన నాణ్యత మెరుగుపరచడం. భారత్ నిర్మాణ్‌లో ప్రాధాన్య అంశాలుగా నీటిపారుదల, రోడ్లు, విద్యుదీకరణ, నీటి సరఫరా, గృహనిర్మాణం, టెలిఫోన్ సౌకర్యం, నిర్మాణ కార్యక్ర మాలను పెద్ద ఎత్తున చేపడతారు. దీని కోసం నేర్పరితనం లేనటువంటి, Semiskilled శ్రామికులు పెద్దమొత్తంలో అవసర మవుతారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (NREGA) నేర్పరితనం లేని శ్రామికులను అందిస్తుంది. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపడి, ఆర్థికవ్యవస్థ వృద్ధికి అవి ఇంధనంగా పనిచేస్తాయి.

భారత్ నిర్మాణ్ వార్షిక లక్ష్యాలు

భారత్ నిర్మాణ్ కార్యక్రమం కింద ప్రాధాన్యత అంశాలకు సంబంధించి వార్షిక లక్ష్యాలను నిర్దేశించారు. 2009 నాటికి 1,46,185 కి.మీ. రోడ్లనిర్మాణం ప్రతిపాదించగా, దీనివల్ల 66,802 unconnected హాబిటేషన్స్ లబ్ధి పొందుతాయి. వ్యవసాయ ఉత్పత్తులను క్షేత్రస్థాయి నుంచి మార్కెట్‌కు చేర్చడానికి వీలుగా చర్యలు చేపట్టారు. ఇందు కోసం ఇప్పుడున్న 1,94,132 కి.మీ.ల రహదారుల ఆధునికీకరణను లక్ష్యంగా పెట్టుకున్నారు. రోడ్లకు సంబంధించి 95 శాతం లక్ష్యాలు 2005-06లో సాధించారు. 2006-07లో 75 శాతం, 2007-08లో 27 శాతం లక్ష్యాలు సాధించారు.లక్ష్యాల సాధనలో రాష్ట్రాల మధ్య తేడాలున్నాయి. 2005-06లో హిమాచల్‌ప్రదేశ్ తన లక్ష్యాలు అధిగమించగా గోవా, త్రిపుర తమ లక్ష్యాలలో 5 శాతం కన్నా తక్కువ సాధించాయి. విద్యుత్‌కు నోచుకోని 1,25,000 గ్రామాల విద్యు దీకరణకు ఉద్దేశించిన పథకం 'రాజీవ్ గాంధీ గ్రామ విద్యుదీ కరణ యోజన'. ఈ పథకం కింద 78 మిలియన్ కుటుంబాలు విద్యుదీకరణ పొందాలి. ఇప్పటి వరకు 69,902 గ్రామాలు, 21,91,375 కుటుంబాలు విద్యుదీకరణ పొందాయి. 55 శాతం లక్షిత గ్రామాలు, 2.8 శాతం లక్షిత కుటుంబాలు మాత్రమే విద్యుదీకరణ పొందాయి. సురక్షితమైన తాగునీరు లభించని నివాసాల్లో... రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని తాగునీటి సరఫరా విభాగం (Drinking Water Supply Department) సురక్షిత తాగునీరు అందిస్తుంది. 1972-73నుంచి Accelerated Rural Water Supply కేంద్ర ప్రభుత్వ పథకంగా ఉంది. 1972 తర్వాత 37 లక్షల చేతి పంపులు, 1.5 లక్షల 'పైప్ వాటర్ సప్లై సిస్టమ్' 15 లక్షల హాబిటేషన్స్‌కు రూ. 50,000 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఈ అవకాశాలు లభించని నివాసాలను 2009 నాటికి భారత్ నిర్మాణ్ పథకం కింద చేర్చనున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జల వనరుల మంత్రిత్వ శాఖ 2009 నాటికి భారీ, మధ్య, చిన్న తరహా నీటి ప్రాజెక్టుల ద్వారా 10 మిలియన్ హెక్టార్ల భూమికి నీటి పారుదల కల్పించాలని నిర్ణయించింది. 2005-06లో జమ్ముకాశ్మీర్, ఉత్తరాంచల్, పంజాబ్, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు తమ లక్ష్యాలు సాధించగా తర్వాత కాలంలో లక్ష్యాల సాధనలో ప్రగతి తగ్గింది. తమిళనాడు మాత్రమే 2005-06, 2006-07లో లక్ష్యాలను మించి ప్రగతి సాధించింది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద నమోదైన కుటుంబాల్లో 84.5 శాతం కుటుంబాలకు సంబంధించి 18.6 మిలియన్ జాబ్ కార్డ్స్ అందించారు. వీరిలో 17 శాతం ప్రజలు ఉపాధి డిమాండ్ చేయగా 90 శాతం మందికి అవకాశాలు కల్పించారు. ఇందులో 2.7 శాతం కుటుంబాలు 100 రోజుల ఉపాధి పొందాయి. ఈ పథకం కింద చేపట్టిన పనుల్లో 68 శాతం చురుగ్గా సాగుతున్నాయి. 9.5 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ పథకం నిధులను 9 రాష్ట్రాలు 80 శాతం వినియోగించుకున్నాయి. నిధులు వినియోగించుకోని రాష్ట్రాలలో ఉపాధి డిమాండ్ సరిపడినంత లేదు. ఈ పథకం కింద పనులను విస్తరించి పంచాయతీలు తమ స్థానిక ప్రాధాన్యతకనుగుణంగా నిర్ణయించుకొనే స్వేచ్ఛనివ్వాలి.